క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులను చేపట్టాలి

నిజాంపేట్: మెరుగైన వసతులు కల్పించే దిశగా పని చేస్తున్నామని 6వ డివిజన్ కార్పొరేటర్ మార్త వాణీప్రసాద్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని లేక్‌వ్యూ కాలనీలోని 1, 2, 3 అంతర్గత రోడ్లతో పాటు కాలనీ ప్రధాన రహదారి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులను చేపట్టాలన్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, సుభాష్, బాలరాజు, లేక్‌వ్యూ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ నవీన్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న శంభీపూర్ రాజు

దుండిగల్: ఎమ్మెల్సీ నవీన్‌రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సోమవారం ఎమ్మెల్సీ నవీన్‌రావు నివాసానికి వెళ్లి పూలబోకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు రావుల శేషగిరి, ఆగం పాండు తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

శంభీపూర్ రాజును కలిసిన పలువురు..

శంభీపూర్ రాజును సోమవారం పలువురు ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రాలు అందజేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

శుభాకాంక్షలు తెలిపిన కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ నేతలు

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నేతలు సోమవారం ఎమ్మెల్సీ నవీన్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలు వేడుకలకు హాజరై నవీన్‌రావుతో కేక్ కట్ చేయించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి



ర్యాలీలో పాల్గొన్న మేయర్ నీలారెడ్డి, బీవీఆర్ఐటీ కళాశాల విద్యార్థులు

నిజాంపేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ 15వ డివిజన్ పరిధిలోని పత్తికుంట చెరువు వద్ద బీవీఆర్ఐటీ మహిళా కళాశాల, నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లకార్డులు చేతబూని ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం, రీ యూజ్, రీ సైకిలింగ్ చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందాం.. అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్, కళాశాల ప్రిన్సిపాల్ సునీత, నేచర్‌క్లబ్ సభ్యులు తనూజా, మౌనిక, కార్పొరేషన్ మెడికల్ ఆఫీసర్ అజీజ్‌ఖాసీం, ఎన్విరానిమెంట్ ఇంజినీర్ సుకృత, అధికారులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా స్కూల్ ఏర్పాటు

- 245 గజాల్లోనే పాఠశాల భవన నిర్మాణం
- అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు ప్రకటన
- ఎంఈఓ, ఎమ్మెల్యేకు స్థానికుల ఫిర్యాదు
- ప్రారంభోత్సవానికి స్థానిక ప్రజాప్రతినిధులు వస్తున్నట్లు ప్రచారం



వెంకటేశ్వరనగర్ వెస్ట్‌లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన స్కూల్

కుత్బుల్లాపూర్: ఎటువంటి అనుమతులు లేకుండా స్కూల్ ఏర్పాటు చేసి అడ్మిషన్లు ప్రారంభించడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెసిడెన్షియల్ ఏరియాలో 245 గజాల్లో కట్టిన నిర్మాణంలో స్కూలు ఏర్పాటు చేయడంపై ఇప్పటికే మండల విద్యాధికారికి స్థానిక ఎమ్మెల్యే వివేకానందకు ఫిర్యాదు చేసిన స్థానికులు హైకోర్టును సైతం ఆశ్రయించారు.

◆ కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ వెస్ట్ ప్లాట్ నం.54లో రెసిడెన్షియల్ అనుమతి తీసుకున్న నిర్మాణదారుడు స్కూల్‌కు కిరాయికి ఇవ్వడం, వెంటనే ఫ్లెక్సీ ఏర్పాటు చేసి అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు ప్రకటన బోర్డు పెట్టడంతో స్థానికులు అవాక్కయ్యారు. వెంటనే విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించడంతో హైకోర్టును ఆశ్రయించి స్కూల్‌కు అనుమతి ఇవ్వరాదని అభ్యర్థించారు.

◆ ఇదే విషయంపై స్థానిక మండల విద్యాధికారులకు ×సాక్షి॰ ఫోన్ ద్వారా వివరాల కోసం ఆరా తీయగా అసలు ఎలాంటి అనుమతులు లేవు అని చెప్పడం విశేషం. ఇదే స్కూల్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించే ఏర్పాట్లు చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థుల భవిష్యత్ ఏమిటి అన్న విషయంపై దృష్టి సారించకుండా ఇలా ప్రారంభోత్సవాలపై స్థానిక ప్రజలు పెదవి విరుస్తున్నారు.

అడ్మిషన్ల పేరిట డబ్బులు వసూలు చేస్తూ ...

ఇదే విషయంపై ఫ్లెక్సీలో ఉన్న ఫోన్ ఆధారంగా వివరాల కోసం ఆరా తీస్తే 5వ తరగతి, ఏడో తరగతి అడ్మిషన్ల కోసం ఫోన్ చేస్తే రూ.20 నుంచి రూ.25వేల లోపు ఫీజులు ఉంటాయని పేర్కొనడం విశేషం. అసలు అనుమతులు లేని ఈ స్కూలు విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. స్కూలు యాజమాన్యం పర్మిషన్ తీసుకోకుండా ఇలా అడ్మిషన్ల పేరిట డబ్బులు వసూలు చేయడం విశేషం.

అనుమతి లేదు.. నోటీసులు పంపాం



ఇళ్ల మధ్యలో పెట్టిన ఆ స్కూలుకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదు. అడ్మిషన్లు తీసుకుంటున్న విషయం తన దృష్టికి రాలేదు. అలా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అనుమతి లేకుండా స్కూలు పెట్టడంపై ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. వారం రోజుల్లో రిప్లై ఇవ్వకుంటే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఒకటవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు అడ్మిషన్లు అంటూ ప్రకటన చేయడం ఇదే విషయంపై ఫిర్యాదు రావడం తాము పరిశీలించి వెంటనే నోటీసులు పంపామని, ఆ స్కూలుకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదు. నిబంధనలు అతిక్రమిస్తే స్కూల్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తాం.

– ఆంజనేయులు, కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి

రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



పాదయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ×కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసా॰ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని మాణిక్యనగర్, మధుసూదన్‌రెడ్డినగర్, ద్వారకానగర్, డీనగర్ బస్తీలలో పాదయాత్ర చేపట్టారు. వర్షాలు పడితే లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్నాయని.. నీరు ఇళ్లల్లోకి చేరుతున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు.

◆ అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ కమీషన్లే లక్ష్యంగా బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు పని చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ పథకాలు సైతం చేయి తడపనిదే లబ్ధిదారులకు అందని పరిస్థితి నెలకొందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని భూస్థాపితం చేస్తేనే తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న ప్రగతియాత్రతో ప్రజలకు ఒరిగేది ఏమి లేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం రాగానే బస్తీల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

◆ ఈ కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నాయకుడు కూన శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, సీనియర్ నాయకులు గడ్డం రాజేందర్‌రెడ్డి, నటరాజ్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గరిగే శేఖర్ ముదిరాజ్, డివిజన్ ఇన్‌చార్జ్‌లు కృష్ణయాదవ్, బిల్లా వెంకటేష్, ద్వారకానగర్ కాలనీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు అలివేలు, లింగం యాదవ్, విజయ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాల తొలగింపు





సుభాష్‌నగర్: ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలను తొలగించాలంటే తప్పనిసరిగా అనుమతి పొందాలి. కానీ కొంతమంది ఎలాంటి అనుమతులు తీసుకోకుండా తమ సొంత ప్రయోజనాల కోసం లక్షలు పెట్టిన నిర్మాణాలను నిబంధనలు విరుద్ధంగా తొలగిస్తున్నారు. దుండిగల్ మున్సిపల్ బహదూర్ పల్లి నుంచి సూరారం వచ్చే జాతీయ రహదారిపై కల్వర్టు ఉన్నచోట ప్రమాదాలు జరగకుండా పక్కన సైడ్ గోడను ఓ వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా రాత్రికి రాత్రే తొలగించాడు. పైగా తనకు ఉపయోగపడే విధంగా కొట్టు చప్పుడు కాకుండా స్లాబ్ వేసుకున్నాడు. సంబంధిత అధికారులు సదరు వ్యక్తిపై ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

కాలుష్యాన్ని తగ్గించకపోతే ముప్పు తప్పదు



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీడిమెట్లలో అవగాహన ర్యాలీ

జీడిమెట్ల: వాతావరణ సమతుల్యతను కాపాడాలంటే ప్రతి ఒక్కరు కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు మొక్కల పెంపకాన్ని బాధ్యతగా చేపట్టాలని జీడిమెట్ల ఇండస్ట్రీయల్ ఏరియా ప్రెసిడెంట్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జీడిమెట్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలా చైర్మన్ సదాశివరెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమల్లో కాలుష్యరహిత ఉత్పత్తులు తయారు చేయాలన్నారు. పరిశ్రమల యాజమాన్యాలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి పరిశ్రమ కావాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి..

ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ మాధవి అన్నారు. ప్లాస్టిక్‌తో ఉత్పత్తయ్యే కర్బన పదార్థాలు వాతావరణాన్ని కాలుష్యం చేస్తాయని అన్నారు. రోజురోజుకు వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించకపోతే రాబోయే రోజుల్లో ముప్పు తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్‌రెడ్డి, పీసీబీ ఈఈ రాజేందర్, ఏఈఈ స్వప్న, వివిధ పరిశ్రమల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్: ప్రభుత్వ స్థలాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని దుండిగల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దికుంట నవీన్‌రెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం గండిమైసమ్మలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పద్మప్రియకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో నిర్మిస్తున్న ఆక్రమణలను వెంటనే తొలగించాలన్నారు. చెరువుల విస్తీర్ణం వివరాలను అందజేయాలని కోరారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి



ఎన్‌హెచ్-44లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని.. అందులో భాగంగా రూ.2.5 లక్షల కోట్ల నిధులు ఇచ్చామని కేంద్ర బొగ్గు గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖామంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. సోమవారం నగర శివారు గుండ్లపోచంపల్లి నుంచి బోయిన్‌పల్లి వరకు జాతీయ రహదారి-44లో 27 కిలోమీటర్ల మేర కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌హెచ్-44లో ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తకుండా రూ.1300 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఐదు అండర్ పాస్‌లు, నాలుగు ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబరు 24వ తేదీ నాటికి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

◆ అయితే షెడ్యూల్ కంటే ముందే పనులు పూర్తి చేస్తున్న అధికారుల పనితీరును కేంద్ర మంత్రి అభినందించారు. తెలంగాణ రాష్ట్రానికి వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.2.5 లక్షల కోట్ల నిధులు, రైల్వేకు రూ.300కోట్ల నిధులు ఇచ్చామని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. కేంద్ర మంత్రి వెంట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పిల్లలను కిడ్నాప్ చేయడానికి వచ్చాడా?

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత



జితేందర్

జీడిమెట్ల: చాక్లెట్లు, ఐస్‌క్రీం చూపించి పిల్లలను కిడ్నాప్ చేయడానికి వచ్చాడని ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానికుల వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన జితేందర్ అనే వ్యక్తి సోమవారం ఉదయం కుత్బుల్లాపూర్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్నాడు.ఇది గమనించిన కొంతమంది జితేందర్‌ను బెదిరించగా అక్కడ నుంచి వెళ్లిపోయాడు. తిరిగి సాయంత్రం అదే ప్రాంతానికి వచ్చిన జితేందర్ కుత్బుల్లాపూర్ గ్రామంలో చాక్లెట్లు చూపిస్తూ 'ఆవో ఆవో అంటూ'హిందీలో పిలుస్తుండగా స్థానికులు పట్టుకుని జితేందర్‌కు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న జీడిమెట్ల పోలీసులు జితేందర్‌ను స్టేషన్‌కు తరలించారు. అసలు జితేందర్ కిడ్నాపర్ అవ్వకపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఏది ఏమైనా జితేందర్ గురించి జీడిమెట్ల పోలీసులు ఆరా తీస్తున్నారు.

అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా కల్వర్ట్ ప్రాంతం

రంగారెడ్డినగర్: లక్షలాది రూపాయలు వెచ్చించి విస్తరించిన కల్వర్ట్ ప్రాంతం అక్రమ పార్కింగ్‌లకు అడ్డాగా మారింది. ఐడీపీఎల్ చౌరస్తా నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే రహదారిని సుమారు రూ.3 కోట్ల నిధులతో 3కిలోమీటర్ల మేర వెడల్పు చేపట్టారు. ఈ క్రమంలో గిరినగర్ సమీపంలోని నాలా ప్రాంతంలో సదరు కాంట్రాక్టర్ కల్వర్ట్ వెడల్పు పనులను జాప్యం చేయడంతో ఆ ప్రాంతానికి రాగానే రోడ్డు కుచించుపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

◆ ఈ విషయమై పలు పర్యాయాలు సాక్షిలో కథనాలు రావడంతో ఎట్టకేలకు సర్కిల్ అధికారులు 6 నెలల క్రితం కల్వర్ట్‌ను రూ.40 లక్షల నిధులతో వెడల్పు చేసి కల్వర్ట్ గోడకు అనుకుని కంచెను సైతం ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా వెడల్పు చేసిన ప్రాంతంలో సీసీ వేయడం మరిచారు. దీంతో స్థానికంగా గాంధీనగర్ పారిశ్రామికవాడకు వచ్చే వాహనాలను కల్వర్ట్‌కు అటుగా.. ఇటుగా నిలుపుతున్నారు.

◆ వాహనాల అక్రమ పార్కింగ్‌లతో కల్వర్ట్ ప్రాంతానికి రాగానే మరలా రోడ్డు కుచించుకుపోయి మరలా సమస్య మొదటికొచ్చింది. దీంతో రాత్రి వేళల్లో ఆ ప్రాంతంలో లైటింగ్ లేకపోవడం, వేగంగా వచ్చే వాహనదారులు రోడ్డుకు అడ్డంగా నిలుపుతున్న వాహనాలను ఢీకొంటున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్, సర్కిల్ అధికారులు కల్వర్ట్ ప్రాంతంలో వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకుని, రాకపోకలు సజావుగా కొనసాగేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.





గిరినగర్ కల్వర్ట్ సమీపంలో ఐడీపీఎల్ - జగద్గిరిగుట్ట రహదారికి ఇరువైపులా వాహనాల అక్రమ పార్కింగ్

'కష్టపడే వారికి కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుంది'



రాజిరెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడే పని చేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ గండిమైసమ్మ దుండిగల్ మండల కిసాన్ సెల్ అధ్యక్షుడిగా బౌంపుగూడెం రాజిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బౌరంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భూపతిరెడ్డి రాజిరెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించే దిశగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన ప్రతి ఒక్కరికి రాజిరెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్రోల సదానందం, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దికుంట నవీన్‌రెడ్డి, బైరి ప్రశాంత్ గౌడ్, లక్ష్మీ, మిద్దెల యాదిరెడ్డి, పరశురామ్ గౌడ్, శ్రీనివాస్, రహమతుల్లా, రాధాకృష్ణ, శివకుమార్ గౌడ్, జక్కుల మల్లేష్, ఇబ్రహీం, అక్బర్ ఖాన్, ధర్మారెడ్డి తదితరులు ఉన్నారు.

క్రైమ్‌రేట్ తగ్గించేందుకే కొత్త ఠాణాల ఏర్పాటు

- కార్మికమంత్రి మల్లారెడ్డి
- మేడ్చల్ ట్రాఫిక్ జోన్ కాంప్లెక్స్, సూరారం పీఎస్‌ల ప్రారంభం
- జిల్లాకు కొత్తగా 9 పీఎస్‌లు, 2 డీసీపీ, 3 ఏసీపీ కార్యాయాలు



మేడ్చల్ ట్రాఫిక్ జోన్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్, పోలీసులు

కుత్బుల్లాపూర్: తెలంగాణలో శాంతి భద్రతలు నెలకొనడంతో అంతర్జాతీయస్థాయి కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని రాష్ట్ర కార్మికమంత్రి మల్లారెడ్డి అన్నారు. సోమవారం మేడ్చల్ ట్రాఫిక్ జోన్ కాంప్లెక్స్, సూరారంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్లను ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాకు కొత్తగా 9 పోలీస్‌స్టేషన్లు, రెండు డీసీపీ కార్యాలయాలు, మూడు ఏసీపీ కార్యాయాలను కేటాయించి సీఎం కేసీఆర్ శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు.

◆ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కేవలం 60–70 పోలీస్ స్టేషన్‌లు మాత్రమే ఉండేవన్నారు. జిల్లాకు అదనంగా 70 పోలీస్‌స్టేషన్‌లను కేటాయించిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నూతన పోలీస్‌స్టేషన్లను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. క్రైమ్ రేట్ తగ్గించేందుకే నూతన పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏదైనా ప్రాంతంలో క్రైమ్ జరిగిన వెంటనే గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకునే వ్యవస్థ తెలంగాణ రాష్ట్రంలో ఉందన్నారు. దీంతో అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయని పేర్కొన్నారు.

◆ సురారం పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో ఈ పరిధిలో పూర్తిగా క్రైమ్ రేట్‌ను కంట్రోల్ చేసి నేర నియంత్రణలో పోలీస్ వ్యవస్థను కట్టుదిట్టం చేయాలన్నారు. సైబరాబాద్‌లోనే ఈ నూతన పోలీస్ స్టేషన్ ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ జోన్ డీసీపీ శ్రీనివాసరావు, మేడ్చల్ డీసీపీ సందీప్, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, రామలింగ రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, సూరారం సీఐ వెంకటేశ్వర్‌రావు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యుత్ విజయోత్సవం..

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా షాపూర్‌నగర్‌లోని ఎంజేఎస్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యుత్ విజయోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులు, రజకులు, ఇండస్ట్రియల్ అసోసియేషన్ సభ్యులు బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్ రంగంలో తీసుకొచ్చిన మార్పుల ద్వారా తమకు జరిగిన మేలును వివరిస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జూనియర్ లైన్‌మెన్‌గా విశిష్ట సేవలు అందిస్తున్న శిరీషను ఎమ్మెల్యే శాలువ, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈలు నర్సింహా రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ లైన్‌మెన్ శిరీషను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్